సాక్షి
జనగామ
ఆదివారం | 21 | ఏప్రిల్ | 2024



నగదు స్వాధీనం
పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీసులు వాహన తనిఖీలు చేశారు. ఇందులో రూ.4.30లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.
- 8లో



22 ప్రత్యేక రైళ్లు
కాజీపేట జంక్షన్ మీదుగా వేసవి ప్రయాణికుల సౌకర్యార్థం 22 ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లు నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.
- 8లో

గరిష్టం/కనిష్టం
$40^0/27^0$
వాతావరణం
జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అధిక శాతం మేఘావృతమై మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు కాస్త తగ్గుతాయి. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన డీఐఈఓ



జనగామ రూరల్: నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఇంటర్ విద్యాధికారి ఆంజనేయరాజు శనివారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట ఏపీఓ బాబు ఉన్నారు.

సెలవులు క్రమశిక్షణకు ఉపయోగపడాలి : డీఈఓ

జనగామ: వేసవి సెలవులు విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంచే విధంగా ఉపయోగపడాలని డీఈఓ రాము అన్నారు. వేసవి సెలవులపై శనివారం విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి బి.శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. వేసవి సెలవులపై ఈనెల 23న జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల హెడ్‌లు.. విద్యార్థుల తల్లిదండ్రులతో ఉదయం 9.30 నుంచి 10.30 వరకు సమీక్ష నిర్వహించి వేసవిలో చేయవలసినవి.. చేయకూడని పనులపై అవగాహన కల్పించిన అనంతరం విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ప్రోగ్రెస్ రిపోర్టులు ఇవ్వాలని పేర్కొన్నారు. సెలవుల్లో విద్యార్థులు త్వరగా నిద్రలేచి యోగా, ధ్యానం, వాకింగ్, ఆటలతో పాటు పెయింటింగ్, డ్యాన్స్, సంగీతం లేదా పబ్లిక్ స్పీకింగ్ వంటి వాటిలో నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. ఇంట్లో బుక్ రీడింగ్, గ్రంథాలయంలో ఇష్టమైన పుస్తకాలు చదవాలని, రోజుకు గంట పాటు తెలుగు, ఇంగ్లిష్, హిందీ రీడింగ్ చేసి, చేతి రాతను మెరుగు పర్చుకోవాలన్నారు. స్కూల్‌లో ఇచ్చిన హోం వర్క్ పూర్తి చేయాలని, సోషల్ మీడియా, వాట్సాప్, వీడియో గేమ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు.

జిల్లా ఆస్పత్రిపై దృష్టి పెట్టాలి

కలెక్టర్‌కు పేషెంట్ మహేష్ వినతి



జనగామ: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సమస్యలు అధికంగా ఉన్నాయి.. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జనగామ పట్టణం గుండ్లగడ్డకు చెందిన పేషెంటు నల్లా మహేష్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కడుపు నొప్పి రావడంతో శనివారం ఆస్పత్రికి వెళ్లగా.. డాక్టర్లు పరీక్షించి పొట్ట స్కానింగ్ చేయాలని చెప్పడంతో రేడియాలజీ హబులోని స్కానింగ్ సెంటర్‌కు వెళ్లాను.. మధ్యాహ్నం 12 గంటల వరకే క్లోజ్ చేసి ఉందని చెప్పాడు. దీంతో ప్రైవేట్‌లో తీయించుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నాడు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే వారు అధికంగా పేదలే ఉంటారని, వారిపై ఆర్థిక భారం పడకుండా చర్యలు తీసుకోవాలని మహేష్ విజ్ఞప్తి చేశారు.

ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలి : డీసీపీ



బచ్చన్నపేట : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్ పోస్టుల వద్ద ప్రతీ వాహనాన్ని తప్పకుండా తనిఖీ చేయాలని జనగామ డీసీపీ సీతారాం అన్నారు. మండల పరిధి కొన్నె గ్రామం వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును ఆయన శనివారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గోపాల్‌నగర్ చౌరస్తా, కొన్నె గ్రామాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, ఈ దారి నుంచి వెళ్లే ప్రతి వాహనాన్ని ఆపి అందులో ఏమి వస్తువులు ఉన్నాయో చూడాలన్నారు. మోతాదు మించి డబ్బులు తీసుకెళ్తున్నా, మద్యం తరలిస్తున్నా సీజ్ చేయాలని చెప్పారు. వాహనాల్లో డబ్బు దొరికితే ఎంతటి వారైనా వదిలి పెట్టొద్దని చెప్పారు. వాహనదారులు ఎన్నికల నియమ, నిబంధనలను పాటించి అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏసీపీ అంకిత్‌కుమార్, ఎస్సై కంకల సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆట పాటలతో విద్య

రఘునాథపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు ఆట, పాటల ద్వారా విద్య అందిస్తున్నట్లు డీడబ్ల్యూఓ జయంతి అన్నారు. శనివారం మండల పరిధి భాంజీపేటలో నిర్వహించిన అంగన్‌వాడీ వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. చిన్నారుల జీవితంలో అంగన్‌వాడీ కేంద్రంలో పొందే విద్య ఎంతో విలువైనదని, మూడేళ్ల చిన్నారులను ఇక్కడ చేర్పిస్తే వారిలో మానసిక, శారీరక, ఆరోగ్య అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. అలాగే గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారాన్ని సెంటర్‌లోనే భుజించాలని అన్నారు. అనంతరం చిన్నారులకు అసెస్‌మెంట్ కార్డులు అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య, అంగన్‌వాడీ టీచర్లు మహేశ్వరి, ఆండాలు, ఆయాలు యాదమ్మ, సుగుణ పాల్గొన్నారు. అలాగే శ్రీమన్నారాయణపురం కేంద్రం–1లో వార్షికోత్సవం నిర్వహించారు.

అకాల వర్షం.. ఆగమాగం



శివునిపల్లిలో తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు



ఛాగల్లులో నేలవాలిన మొక్కజొన్న పంటను చూపిస్తున్న రైతు

జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం
- తడిసిన ధాన్యం, మొక్కజొన్న పంటలు
- పిడుగులతో మూగజీవాల మృత్యువాత
- తాటికొండలో 37 మిల్లీమీటర్ల వర్షం

జిల్లాలో శనివారం ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాలు, కల్లాలు, పొలాల్లోని ధాన్యం, మొక్కజొన్న పంటలు తడిసిపోయాయి. పిడుగులు పడి మూగజీవాలు మృత్యువాత పడగా.. పలు ప్రాంతాల్లో చెట్లు ధ్వంసమయ్యాయి. ఓ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వస్తువులు కాలిపోయాయి. తెల్లవారుజాము నుంచి ఆకాశం మేఘావృతమై ఉండడంతో అధికార యంత్రాంగం జిల్లాలోని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతోపాటు రైతులను అప్రమత్తం చేసింది. ధాన్యం రాశులపై టార్పాలిన్ కవర్లు కప్పగా.. కాంటా పూర్తయిన బ్యాగులను రైస్ మిల్లులకు తరలించారు. మధ్యాహ్నం నుంచి వర్షం పెరగడంతో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు రంగంలోకి దిగారు. నర్మెట, జఫర్‌గఢ్, స్టేషన్‌ఘన్‌పూర్, తరిగొప్పులలో భారీగా.. దేవరుప్పుల, లింగాలఘణపురం, బచ్చన్నపేట, మండలాల పరిధిలో తక్కువ వర్షపాతం నమోదైంది. కొన్ని చోట్ల ఎగువ నుంచి వచ్చిన వరద కారణంగా కొద్దిపాటి ధాన్యం తడిసిపోగా.. పాడవకుండా తగిన చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోని సుమారు వెయ్యి బ్యాగుల ధాన్యం వర్షపు నీటిలో తడిసిపోగా.. కల్లాల వద్ద భారీగా నష్టం వచ్చినట్లు సమాచారం. జిల్లాలో సగటు వర్షపాతం 8.8 మిల్లీమీటర్లు నమోదైనట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. - జనగామ

8.8 మిల్లీమీటర్ల వర్షపాతం	
నర్మెట	49.5
జఫర్‌గఢ్	45.0
స్టేషన్‌ఘన్‌పూర్	40.8
తరిగొప్పుల	27.8
దేవరుప్పుల	6.3
లింగాలఘణపురం	4.8

ధాన్యం కుప్పలపై పరదాలు కప్పుతున్న రైతులు



అప్రమత్తమైన అన్నదాత

లింగాలఘణపురం : మండల కేంద్రం, నెల్లుట్ల, పటేల్‌గూడెం, నవాబుపేట, కుందారం, చీటూరు, నేలపోగుల, వడిచర్ల, కొత్తపల్లి, వనపర్తి గ్రామాల్లో కొద్దిసేపు అకాల వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న రైతులు ధాన్యం తడవకుండా అప్రమత్తమై పరదాలు కప్పుకున్నారు. వరి కోయని రైతులు ఆందోళన చెందారు. నేలపోగులలో నకీర్త యాదయ్య ఇంటి వెనుకాల ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

కాలిన వస్తువులు.. చెట్లు ధ్వంసం



కాలిపోయిన ఫ్రిజ్

చిల్పూరు: మండల కేంద్రంలో ఉరుములు, మెరుపులతో వర్షంతోపాటు ఇంటిపై పిడుగులు పడ్డాయి. బోళ్ల రాజ్‌కుమార్ ఇంట్లో విలువైన వస్తువులు కాలిపోయాయి. రూ.80 వేల వరకు నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు. ఉదయం టీవీ చూస్తుండగా వర్షం రావడంతో మేయిన్ ఆఫ్ చేయడానికి బయటకు వస్తున్న క్రమంలో పెద్ద శబ్దం అయింది. ఇంతలో కరెంటు పోయింది. విద్యుత్ మీటరుతోపాటు ఇంట్లోని వస్తువులు కాలిపోయాయి. ఇంట్లో ఉంటే ప్రమాదం జరిగి ఉండేదని రాజ్‌కుమార్ పేర్కొన్నాడు. ఇదిలా ఉండగా.. శ్రీపతిపల్లి ప్రభుత్వ పాఠశాల గేట్ ముందు ఉన్న దుల్సన్ చెట్టుపై పిడుగు పడి రెండుగా చీలింది. ఒంటి పూట బడులు కావడంతో పిల్లలు ఉదయం ఆ చెట్టుకిందే ఆడుకుంటుండగా ఉరుములు, మెరుపుల వర్షం రావడంతో స్కూల్ లోకి వెళ్లారు. కొద్ది సేపటికే పిడుగు పడింది. అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కృష్ణాజీగూడెంలో ఊరడి యాదగిరికి చెందిన రూ.80 వేల విలువైన ఆవు పిడుగు పాటుతో మృతి చెందింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడితోపాటు నాయకులు ఊరడి రాజు, సాదం గట్టయ్య, సాదం భీమన్న కోరారు.

నేలవాలిన వరి, మొక్కజొన్న..

స్టేషన్‌ఘన్‌పూర్ : మండల పరిధిలో రెండు గంటల పాటు భారీ వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. తాటికొండలో అత్యధికంగా 37 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కుప్పలపై పరదాలు కప్పి ఉంచడంతో వడ్లు పాక్షికంగా తడిశాయి. పలు గ్రామాల్లో గాలి వానకు వరి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. దాదాపు వంద ఎకరాల్లో పంటలు పాక్షికంగా నష్టపోయినట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. శివునిపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సివిల్ సప్లయ్ డీసీఎస్‌ఓ రోజారాణి, ఐకేపీ డీపీఎం వరలక్ష్మి సందర్శించారు. రైతులకు సరిపడా పరదాలు ఇవ్వాలని, జాప్యం లేకుండా కొనుగోళ్లు చేపట్టాలని నిర్వాహకులను ఆదేశించారు.

పిడుగుపాటుకు రెండు దుడ్డెలు మృతి

తాటికొండలో పిడుగుపాటు కారణంగా రైతు మారపాక కృష్ణమూర్తికి చెందిన రెండు గేదె దుడ్డెలు మృతి చెందాయి. రూ.50వేల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు. ఇదిలా ఉండగా.. గ్రామంలోని చాడ వెంకమ్మ ఇంటిపై గోడ కూలింది.



నేల వాలిన వరి పంట

వాన వచ్చి ఆగం చేసింది



మాది శివునిపల్లి. నాలుగు ఎకరాల్లో పండించిన ధాన్యాన్ని ఐకేపీ కొనుగోలు కేంద్రానికి శుక్రవారం తీసుకొచ్చినం. తేమ 18 శాతం ఉండగా ఆరబెట్టుకున్నాం. ఉదయం ఒక్కసారిగా వాన వచ్చి ఆగం చేసింది. వడ్లు తడిసిపోవడంతో మళ్లీ ఆరబోస్తున్నం. పెద్దసార్లు స్పందించి మా వడ్లను తొందరగా కొనుగోలు చేయాలి.
- గోనెల మహేంద్ర

తడిసిన ధాన్యం కుప్పలు..

నర్మెట: అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాలతో పాటు కల్లాలో ఆరబోసిన ధాన్యం కుప్పలు తడిసిపోయాయి. కోతకు వచ్చిన వరి పొలంలో నీరు నిలవడంతో రెండు వారాల వరకు కోతమిషన్లు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. రైతులు ఆందోళన చెందుతున్నారు. తొమ్మిది కొనుగోలు కేంద్రాల్లో 400 బస్తాల ధాన్యం తడిసినట్లు సమాచారం.



కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షపు నీరు

చెట్లపై పిడుగులు..

తరిగొప్పుల: ఉదయం ఉరుములు, పిడుగులతో కూడిన తేలికపాటి వర్షం కురిసింది. అంకుషాపూర్, నర్సాపూర్ గ్రామాల్లో చెట్లపై పిడుగులు పడ్డాయి.

బచ్చన్నపేట: కేసిరెడ్డిపల్లి, భోనకొల్లూర్, లక్ష్మాపూర్, బండనాగారం, కట్కూర్ గ్రామాల్లో వర్షానికి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో, రైతుల వ్యవసాయ బావుల వద్ద వరి కోత కోసి కుప్పలుగా పోసిన ధాన్యం తడిసింది. వరి కుప్పలపై పరదాలను కప్పినా ధాన్యం రాసుల కింది నుంచి వర్షం నీరు ప్రవహించింది. అలాగే ఈదురు గాలులకు పరదాలు ఎగిరి పోయాయి. పలు చోట్ల చెట్లు విరిగి పడ్డాయి.

జఫర్‌గఢ్: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసిన ధాన్యం తడిచింది.

జనగామ రూరల్: జనగామ మండలంలోని గానుగుపహడ్, అడవికేశ్వాపూర్, వెంకిర్యాల, ఎర్రగొల్లపహాడ్ మరిగడి గ్రామాల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. అడవికేశ్వాపూర్ కేంద్రంలో ధాన్యం తడవగా రైతులు నీటిని తొలగించి ఆరబెట్టారు. ఈదురు గాలులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

మహిళల గోస పట్టదా..?

- ఎంసీహెచ్ వెయిటింగ్ హాల్‌లో నరకమే
- తాగడానికి, నిత్యావసరాలకు నీరు కరువు
- స్కానింగ్ కోసం గంటల తరబడి నిరీక్షణ
- సమయ పాలనపై కొరవడిన పర్యవేక్షణ



వెయిటింగ్ హాల్‌లో నిరీక్షిస్తున్న గర్భిణులు

జనగామ: పేరు గొన్న.. ఊరు దిబ్బ అన్నట్టుగా మారింది జనగామ చంపక్‌హిల్స్ మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్) పరిస్థితి. ఎంసీహెచ్ వెయిటింగ్, స్కానింగ్ హాళ్లలో ఫ్యాన్లు లేవు. కూలర్లు పనిచేయవు. ఇటీవల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో డెలివరీ, నెలవారీ పరీక్షల కోసం వచ్చే గర్భిణులు నరకం చూస్తున్నారు. ఆస్పత్రికి వచ్చే వారికి సమస్యలు స్వాగతం పలుకుతుండడంతో గత్యంతరం లేక పేద కుటుంబాల వారు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించే పరిస్థితులు నెలకొన్నాయి.

జనగామ ఎంసీహెచ్‌కు వచ్చిన తర్వాత ఓపీ నుంచి మొదలు.. చెకప్, స్కానింగ్ వరకు నిరీక్షించాల్సిందే. ఓపీ వద్ద కనీసం కుర్చీలు కూడా లేక సుమారు పదిహేను నిమిషాల పాటు నిలబడే ఉంటున్నారు. ఇక డాక్టర్ చెకప్ కోసం వెయిటింగ్ హాల్‌లో సుమారు రెండు గంటల పాటు వేచి ఉండాల్సిందే. భవన నిర్మాణ సమయంలో వెయింటిగ్ హాల్‌తో పాటు స్కానింగ్ సెంటర్ వద్ద ఒక్క ఫ్యాన్ కూడా ఏర్పాటు చేయలేదు. కేవలం కూలర్లే ఆధారం. అవి కూడా రిపేరుకు రావడంతో మూలన పడేసి చేతులు దులుపుకున్నారు. దీంతో ఆస్పత్రికి ఆరోగ్య పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణులు, పిల్లలు, సహాయకులు ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అవుతూ.. చెమటలు పట్టి డీహైడ్రేషన్‌కు గురవుతున్నారు. రెండు రోజుల క్రితం ఓ గర్భిణి వడదెబ్బకు గురై వెయిటింగ్ హాల్‌లోనే కుప్పకూలి పోయినా.. ఇప్పటి వరకు కూలర్లు ఏర్పాటు చేయలేదు.

వెంటాడుతున్న తాగునీటి కష్టాలు

మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రంలో తాగునీటి కష్టాలు తప్పడం లేదు. నిత్యావసరాలకు డాక్టర్లతో పాటు పేషెంట్లు ఇబ్బంది పడుతున్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంటు ఒక్కటే తాగునీటికి దిక్కు. గతంలో ప్రతి ఫ్లోర్‌లో కూలింగ్ రిఫ్రిజిరేటర్లు ఏర్పాటు చేయగా.. ఇప్పుడు వాటిని స్టోర్‌రూంకు పరిమితం చేశారు. దాహం తీర్చుకోవాలంటే ఒకటి, రెండు ఫ్లోర్లు కిందకి దిగి రావాలి. దీంతో వృద్ధులు, మోకాళ్ల నొప్పులతో బాధపడే సహాయకులు పట్టపగలే చుక్కలు చూస్తున్నారు. రెండు రోజుల క్రితం బోరు మోటారు సైతం రిపేరుకు రావడంతో తాగునీరు ప్రైవేట్ దుకాణాల్లో కొనుక్కుంటున్నారు. ఎంసీహెచ్ ప్రాంగణంలో విశ్రాంతి గది లేక పోవడంతో గర్భిణులు, పిల్లలకు సహాయకులుగా వచ్చిన వారు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ ఆరు బయటనే ఉంటున్నారు.

నాలుగు నెలల నుంచి వస్తున్నా..



నాలుగు నెలల నుంచి చెకప్ కోసం వస్తున్నాను. ప్రస్తుతం ఎండలు మండుతున్నాయి. వెయిటింగ్ హాల్, స్కానింగ్ వద్ద ఫ్యాన్లు, కూలర్లు లేవు. ఉక్కపోత భరించలేక పోతున్నాం. స్కానింగ్ వద్ద రెండు గంటల సమయం పడుతోంది. గర్భిణులు పడుతున్న ఇబ్బందులను అధికారులు తీర్చాలి.
- ఎం.సౌమ్య, జనగామ

ఫ్యాను గాలి లేదు..



మామిడి తోటలు కౌలుకు తీసుకునేందుకు నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నుంచి వచ్చాం. నా కుమార్తె గర్భిణి. ఆరోగ్య పరీక్షల నిమిత్తం ఎంసీహెచ్‌కు తీసుకువస్తున్నాను. డాక్టర్ కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది. వెయిటింగ్ హాల్‌లో కూలర్లు, ఫ్యాన్లు లేవు. చాలా సార్లు ఇబ్బంది పడ్డాము.
- బి.చెన్నమ్మ, గర్భిణి తల్లి

ఇబ్బందులు తప్పడం లేదు..



నా భార్యను ఆరు నెలల నుంచి చెకప్ కోసం తీసుకు వస్తున్నాను. చిన్న పిల్లలు ఉండడంతో వెంట తీసుకొస్తున్నాను. ఓపీ, డాక్టర్ కోసం, స్కానింగ్ సమయంలో ఆలస్యం అవుతోంది. వెయిటింగ్ హాల్‌లో కనీసం గాలి ఆడే పరిస్థితి లేదు. ఇంటికి వెళ్లే వరకూ ఇబ్బందులు తప్పడం లేదు.
- ఎండీ.సుల్తాన్, జనగామ

రెండు ఫ్లోర్లు దిగాల్సిందే..



నా భార్య నిఖిల డెలివరీ కోసం రెండు రోజుల క్రితం వచ్చాను. నార్మల్ డెలివరీ అయింది. ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. బాటిల్ నీటి కోసం రెండు ఫ్లోర్లు కిందకు రావాలి. రెండు రోజులుగా బోరు పనిచేయకపోవడంతో బయట నీళ్లు కొనుక్కొచ్చుకున్నాం.
- మన్నె ప్రభాకర్, రాజపేట, యాదాద్రి జిల్లా

కూలర్లు రిపేరు చేయిస్తున్నాం



ఎంసీహెచ్ వెయింటింగ్ హాల్‌లో గర్భిణులు, ఇతర పేషెంట్లకు ఇబ్బంది లేకుండా కూలర్లను రిపేరు చేయిస్తున్నాం. నిర్మాణ సమయంలో వెయింటిగ్ హాల్లో ఫ్యాన్లు బిగించేందుకు రూఫ్ లేకపోవడంతో కేవలం కూలర్లు ఏర్పాటు చేశాం. మరోసారి సమస్య తలెత్తకుండా చూస్తాం. బోరు మోటారు రిపేరుకు రావడంతో ఒక్కరోజే తాగునీటికి ఇబ్బంది వచ్చింది. మిగతా రోజుల్లో నిత్యావసరాలకు, తాగునీటి ఇబ్బందులు లేవు.
- డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, ఎంసీహెచ్ సూపరింటెండెంట్



ఆస్పత్రి ఆవరణలో మూతపడిన వాటర్ ప్లాంటు



నీటి కోసం సెకండ్ ఫ్లోర్‌నుంచి కిందకు వస్తున్న పేషెంట్ల సహాయకులు

ప్రసూతి ఆస్పత్రి పేరు నిలబెట్టండి

- ఎక్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు

సాక్షి ఎఫెక్ట్

జనగామ: జనగామ ఎంసీహెచ్ పేరును నిలబెట్టే విధంగా సంబంధిత అధికారుల కు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ జిల్లా జేఏసీ చైర్మన్ మంగళ్లపల్లి రాజు శనివారం సీఎం రేవంత్‌రెడ్డికి ఎక్స్‌లో విజ్ఞప్తి చేశారు. 'వడదెబ్బకు గురైన గర్భిణి–ఎంసీహెచ్‌లో ఫ్యాన్లు లేవు, రిపేరులో కూలర్లు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనాన్ని జోడిస్తూ సీఎంతో పాటు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జిల్లా కలెక్టర్‌కు పంపించారు. ప్రసూతి ఆస్పత్రిని బాగు చేసేలా చొరవ చూపి ప్రభుత్వం ఆశించిన మేర వైద్య సేవలతో పాటు కనీస వసతి సౌకర్యాలు కల్పించాలని ఈ సందర్భంగా కోరారు.


@TelanganaCMO @revanth_anumula
@TelanganaHealth @TelanganaCS
@Collector_JGN
వడదెబ్బకు గురైన గర్భిణి

సాక్షి కథనం క్లిప్పింగ్‌తో ఎక్స్‌లో సీఎంకు పంపిన ఫిర్యాదు

అభద్రతా భావానికి లోనుకావొద్దు

- టోల్‌ఫ్రీ 14416 నంబర్‌లో సంప్రదించండి
- మానసిక వైద్య నిపుణుల వెల్లడి



విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇస్తున్న డాక్టర్ సిద్ధారెడ్డి

జనగామ: విద్యార్థులు పరీక్షల్లో ఫెయిల్ అయితే అభద్రతా భావానికి లోనుకావొద్దని జిల్లా మానసిక వైద్య నిపుణులు డాక్టర్ గంగం సిద్ధారెడ్డి, సైకాలజిస్ట్ డాక్టర్ లిఖిత సూచించారు. శనివారం డీఎంహెచ్‌ఓ హరీశ్‌రాజ్, ప్రోగ్రాం ఆఫీసర్(ఎన్‌సీడీ) డాక్టర్ సుధీర్ ఆదేశాల మేరకు పాఠశాలల విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించిన తర్వాత వారు మాట్లాడారు. మరో రెండు రోజుల్లో ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకావొద్దని చెప్పారు. ఒక వేళ ఫెయిల్ అయితే పట్టుదలతో చదివి సప్లిమెంటరీలో పాస్ కావాలే తప్ప ఆత్మహత్యలకు పాల్పడవద్దన్నారు. మానసిక సమస్యలు ఉంటే టెలిమానస్ టోల్ ఫ్రీ నంబర్(14416)కు కాల్ చేయాలని, వైద్యులు ఉచితంగా కౌన్సిలింగ్ ఇస్తారని చెప్పారు. ప్రత్యేకంగా కౌన్సిలింగ్ అవసరమని గుర్తిస్తే కుటుంబ సభ్యులు జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని మానసిక ఆరోగ్య విభాగాన్ని సంప్రదించాలని సూచించారు.

పోస్టల్ బ్యాలెట్ పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



సెక్టోరియల్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో సెక్టోరియల్ అధికారులు, పోస్టల్ బ్యాలెట్ బృందాలకు ఏవీపీడీ, ఏవీసీఓ, ఏవీఈఎస్‌లపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, ఎసెన్షియల్ సర్వీస్ ఓటర్లు పోస్టల్ బ్యాలెట్‌లో ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. ఇంటి నుంచి ఓటు వేసేందుకు ఫారం–12డీ ద్వారా ఈనెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలని, మే 3 నుంచి 8లోగా నమోదు చేస్తామని తెలిపారు. ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని వివరించారు. ఎసెన్షియల్ సర్వీస్ వారు ఫారమ్ 13ఏ, 13బీ, 13సీలో పోస్టల్ బ్యాలెట్ పేపర్ సీరియల్ నంబర్, అటెస్టెడ్ సంతకం చేసి నమోదు చేయాలన్నారు. ఓటు హక్కు వినియోగంపై సెంటర్ల వద్ద అవగాహన కల్పించడానికి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ వివరాలు రోజువారీగా రిజిస్టర్‌లో నమోదు చేసి రిపోర్ట్ ఇవ్వాలని, ఇంటి నుంచి ఓటు వేసే ప్రక్రియను తప్పనిసరిగా వీడియో తీయాలని సూచించారు. కార్యక్రమంలో శిక్షణ నోడల్ అధికారి అనిల్‌కుమార్, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.



ఓటు హక్కును వినియోగించుకోవాలి

- జిల్లా స్వీప్ నోడల్ అధికారి వినోద్‌కుమార్

జనగామ రూరల్: ఓటు హక్కు ఎంతో విలువైనది.. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా స్వీప్ నోడల్ అధికారి వినోద్‌కుమార్, ఆర్డీఓ కొమురయ్య అన్నారు. శనివారం పట్టణంలోని మెప్మా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన వారు విధిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, అర్హులంతా జాబితాలో పేర్లను సరిచూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం నుంచి రైల్వేస్టేషన్ వరకు ర్యాలీ చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మెప్మా పీడీ హర్షవర్ధన్, ఆర్గనైజర్ షాహీన్, సుల్తాన, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

మద్యం నియంత్రణపై దృష్టి పెట్టాలి

- ఎన్నికల వ్యయ పరిశీలకులు దిలీబన్



అధికారులతో మాట్లాడుతున్న దిలీబన్

స్టేషన్‌ఘన్‌పూర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు మద్యం నియంత్రణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎ.దిలీబన్ అన్నారు. రెవెన్యూ, పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారులు, ఎన్నికల పర్యవేక్షణ బృందాలతో స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. మద్యం అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని, ఎన్నికలకు సంబంధించిన ప్రతీ అంశంపై అప్రమత్తంగా పనిచేయాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన సభలు, సమావేశాలు, ర్యాలీలు జరిగితే ఆయా రాజకీయ పార్టీల ఖర్చులను గుర్తించాలని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుహాసిని, ఆర్‌డీఓ డీఎస్ వెంకన్న, ఏసీపీ భీమ్‌శర్మ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డీటీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.3 లక్షల నగదు స్వాధీనం



కొడకండ్ల: స్వాధీనం చేసుకున్న నగదును చూపిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

కొడకండ్ల: కొడకండ్ల మండలం గిర్నితండా చెక్ పోస్టు వద్ద శనివారం రూ.3 లక్షల నగదు పట్టుకున్నట్లు పాలకుర్తి సీఐ మహేందర్ రెడ్డి తెలిపారు. ఒడిశాలోని బాలేశ్వర్‌కు చెందిన రాకేష్‌కుమార్ టాటా ఏస్ ట్రాలీలో సూర్యాపేట జిల్లా తిర్మలగిరి వైపునకు వెళ్తున్నాడు. వాహనం తనిఖీ చేయగా ఎలాంటి ఆధారం లేని రూ.3 లక్షలు లభించడంతో స్వాధీనం సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

మడికొండలో రూ.1.30 లక్షలు

మడికొండ: మడికొండ చౌరస్తా వద్ద శనివారం పోలీసులు.. ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన కందాల రవీంద్రాచారి వద్ద రూ.1.30 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించి ఆధారం చూపకపోవడంతో సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ తెలిపారు.

మూడో రోజు నలుగురు నామినేషన్లు దాఖలు



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఎంసీపీఐ (యూ) అభ్యర్థి మాస సావిత్రి

కాళోజీ సెంటర్ : వరంగల్ పార్లమెంట్ స్థానానికి శనివారం మూడో రోజు నలుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఎంసీపీఐ(యూ) అభ్యర్థిగా మాస సావిత్రి, స్వతంత్ర అభ్యర్థిగా గాదెపాక అనిల్‌కుమార్, ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థిగా మేకల సుమన్, స్వతంత్ర అభ్యర్థిగా బరిగెల శివ నామినేషన్ వేశారు. నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్యకు అందజేశారు. కాగా, ఇప్పటి వరకు మూడు రోజుల్లో మొత్తం 9 మంది అభ్యర్థులు 11 నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు.

'జై కాంగ్రెస్' అన్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ సారయ్య



భూపాలపల్లి: మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కాంగ్రెస్ పార్టీకి జై కొట్టారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన వరంగల్ పార్లమెంటరీ బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశంలో సారయ్య ప్రసంగించారు. మాట్లాడడం ముగిసిన అనంతరం జై కాంగ్రెస్ అంటూ కుర్చీలో కూర్చున్నారు. దీంతో స్టేజీపై ఉన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, గండ్ర వెంకటరమణారెడ్డి, ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్, కార్యకర్తలు కాసేపు నవ్వారు.

పార్లమెంట్‌లో రెండోసారి ఎంట్రీ ఎవరికో..!

బయ్యారం: మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం ఆవిర్భావం (2009లో పునర్విభజన) తరువాత జరిగిన మూడు ఎన్నికల్లో ప్రధాన పార్టీల నుంచి ముగ్గురు ఎన్నికయ్యారు. మొదటి సారి కాంగ్రెస్ నుంచి పోరిక బలరాంనాయక్, రెండోసారి అప్పటి టీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రొఫెసర్ సీతారాం నాయక్, మూడోసారి ప్రస్తుత బీఆర్‌ఎస్ అభ్యర్థి మాలోత్ కవిత ఎంపీలుగా గెలుపొందారు. అయితే నాలుగోసారి(ప్రస్తుతం) జరుగుతున్న ఎన్నికల్లో ప్రధానపార్టీలు కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపీ బలరాంనాయక్, బీఆర్‌ఎస్ నుంచి సిట్టింగ్ ఎంపీ కవిత, బీజేపీ నుంచి మాజీ ఎంపీ సీతారాంనాయక్ బరిలో ఉన్నారు. దీంతో వీరిలో ఎవరు గెలిచి పార్లమెంట్‌కు రెండోసారి ఎంట్రీ అవుతారోనని ఓటర్లు చర్చించుకుంటున్నారు.



ఈ ముచ్చటెరికేనా ?

● రెండు ఉప ఎన్నికల్లో ఎంపీగా కేసీఆర్ విజయం

తెలంగాణలో లోక్‌సభకు 9 సార్లు ఉప ఎన్నికలు

సాక్షిప్రతినిధి, వరంగల్ : తెలంగాణ వ్యాప్తంగా 17 లోక్‌సభ స్థానాలు ఉండగా.. పలు చోట్ల ఉప ఎన్నికలు 9 పర్యాయాలు జరిగాయి. 1960 నుంచి 1987 వరకు ఏడు స్థానాలకు ఐదు ఉప ఎన్నికల నోటిఫికేషన్లు విడుదల అయ్యాయి. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్‌ఎస్) ఆవిర్భావం తర్వాత 2006 నుంచి 2015 వరకు నాలుగు నోటిఫికేషన్ల ద్వారా ఏడు పార్లమెంట్ స్థానాలకు ఉప ఎన్నికలు వచ్చాయి. 1960 నుంచి 1987 వరకు ఏడు స్థానాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో ఆరు చోట్ల కాంగ్రెస్, ఒక స్థానంలో కాంగ్రెస్ (ఐ)పార్టీ అభ్యర్థులు గెలిచారు. 2006 నుంచి 2015 వరకు వచ్చిన ఉప ఎన్నికల్లో ఐదు సార్లు టీఆర్‌ఎస్ (బీఆర్‌ఎస్), ఒకసారి కాంగ్రెస్, మరోసారి టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు.

రెండు ఉప ఎన్నికల్లో కేసీఆర్ గెలుపు..


1960లో నల్లగొండ ఎంపీ స్థానానికి ఉప ఎన్నిక జరగ్గా కాంగ్రెస్ అభ్యర్థి వి.కాశీరాం, 1965 మహబూబాబాద్ ఉప ఎన్నికలో ఆర్.సురేందర్ రెడ్డి (కాంగ్రెస్)లు గెలిచారు. 1979లో వరంగల్, సికింద్రాబాద్, సిద్దిపేట పార్లమెంట్ స్థానాలకు వచ్చిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన జి.మల్లికార్జున్‌రావు, పి.శివశంకర్, నంది ఎల్లయ్యలు విజయం సాధించారు. 1983 పెద్దపల్లి ఉప ఎన్నికలో గొట్టె భూపతి (టీడీపీ), 1987లో సికింద్రాబాద్ నుంచి పత్తి మణెమ్మ (కాంగ్రెస్)లు గెలిచారు. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో 2006లో కరీంనగర్ పార్లమెంట్‌కు జరిగిన ఉప ఎన్నికలో టీఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గెలుపొందారు. 2008లో కరీంనగర్, హనుమకొండ, వరంగల్, ఆదిలాబాద్ స్థానాలకు ఉప ఎన్నికలు జరగ్గా, రెండు టీఆర్‌ఎస్, ఒకటి టీడీపీ, ఒకటి కాంగ్రెస్ గెలుచుకున్నాయి. ఈ ఎన్నికల్లో కరీంనగర్ నుంచి కేసీఆర్ విజయం సాధించగా, హనుమకొండ నుంచి బి.వినోద్‌కుమార్ (టీఆర్‌ఎస్), వరంగల్ నుంచి ఎర్రబెల్లి దయాకర్‌రావు (టీడీపీ), ఆదిలాబాద్ నుంచి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి (కాంగ్రెస్) విజయం సాధించారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో మెదక్, వరంగల్ నుంచి ఎంపీలుగా గెలిచిన కేసీఆర్, కడియం శ్రీహరిలు రాజీనామాలు చేయడంతో ఏర్పడిన ఖాళీల సందర్భంగా జరిగిన ఉప ఎన్నికలో మెదక్ నుంచి కె.ప్రభాకర్ రెడ్డి (టీఆర్‌ఎస్), వరంగల్ నుంచి పసునూరి దయాకర్ (టీఆర్‌ఎస్)లు గెలుపొందారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

తగ్గుతున్న ఉనికి..

మహబూబాబాద్ సెగ్మెంట్‌లో పడిపోతున్న కమ్యూనిస్టుల ప్రభావం..

- పార్లమెంట్ స్థానం ఏర్పడిన తొలినాళ్లల్లో ప్రభంజనం
- 17 సార్లు జరిగిన ఎన్నికల్లో 12 దఫాలు బరిలో దిగిన వామపక్షాలు
- నాలుగు సార్లు ఎర్రజెండా పార్టీల విజయం
- 10 సార్లు కాంగ్రెస్, ఒకసారి టీడీపీ, రెండుసార్లు బీఆర్‌ఎస్





పోరిక బలరాంనాయక్



అజ్మీరా సీతారాంనాయక్



మాలోత్ కవిత



ఆర్. సురేందర్‌రెడ్డి



ఎం. బాబూరావు

సాక్షి, మహబూబాబాద్ : ప్రజా, సాయుధ, రైతు పోరాటలకు నాయకత్వం వహించిన పార్టీలు వామపక్షాలు. పేదలకు కొండంత అండగా ఉండే కమ్యూనిస్టుల ప్రభావం మహబూబాబాద్ సెగ్మెంట్‌లో తగ్గుతూ వస్తోంది. పార్లమెంట్ స్థానం ఏర్పడిన తొలినాళ్లల్లో ప్రభంజనం సృష్టించిన ఆ పార్టీల్లో ప్రస్తుతం ఉనికి తగ్గుతున్నట్లు కనిపిస్తోందని పలువురు పేర్కొంటున్నారు. మారిన సమీకరణాలు.. నియోజకవర్గాల విభజనతో పేరు మార్చుకున్న మహబూబాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ తిరిగి 2009 పునర్విభజన తర్వాత అదే పేరుతో మళ్లీ ఆవిర్భవించింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కాని.. తర్వాత విభజన కాని.. ఇలా ఏ అంశాన్ని చూసినా గిరిజనులే కేంద్రంగా ఈ నియోజకవర్గం ఏర్పడింది. తెలంగాణ సాయుధ పోరాటం, రైతాంగ ఉద్యమం, నక్సల్ బరి ఉద్యమాలు, కమ్యూనిస్టుల పోరాటాలకు నిలయంగా ఈ పార్లమెంట్ నియోజకవర్గం విరాజిల్లింది. అయితే ఇప్పటి వరకు 17 సార్లు ఎన్నికలు జరగగా.. నాటి నుంచి నేటి వరకు కమ్యూనిస్టుల ప్రభావం తగ్గుతూ వస్తోంది.

కమ్యూనిస్టుల బలమైన స్థానం

ఉద్యమాలకు కేంద్రబిందువుగా ఉన్న మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం మొదటి నుంచి కమ్యూనిస్టులకు బలమైన ఓటు బ్యాంకు ఉన్న ప్రాంతంగా పేరుంది. 1957 నుంచి మహబూబాబాద్ పార్లమెంట్ స్థానంగా ఉంది. అప్పటి నుంచి 1965 వరకు రెండు పర్యాయాలు సాధారణ ఎన్నికలు, 1965 ఉప ఎన్నిక మొత్తం మూడు సార్లు ఎన్నికలు జరగగా.. కాంగ్రెస్ పార్టీకి మొదటిసారి ఎన్నిక 1957లో పీడీఎఫ్ ఉండగా.. రెండు పర్యాయాలు సీపీఐ, సీపీఎం అభ్యర్థులే ఉన్నారు. తర్వాత ఏపీలోని తూర్పు, పశ్చిమ గోదావరి ప్రాంతాలతోపాటు ఖమ్మం జిల్లాలోని సగభాగంతో ఏర్పడిన భద్రాచలం పార్లమెంట్ నియోకవర్గంలో కూడా కమ్యూనిస్టులు పార్టీలు బలంగానే ఉన్నాయి. ఇందులో భద్రాచలం, పినపాక (మణుగూరు), ఇల్లెందు, కొత్తగూడెం నియోజకవర్గాల్లో కమ్యూనిస్టు పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు గెలుపొందినవి ఎక్కువగా ఉన్నాయి. భద్రాచలం పార్లమెంట్ పేరుతో 11 పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. ఇందులో తొమ్మిది సార్లు కమ్యూనిస్టు పార్టీలు పోటీ చేయగా నాలుగు సార్లు గెలుపొందాయి. ఇందులో ఏడు సార్లు సీపీఐ పోటీ చేసి మూడు సార్లు గెలుపొందింది. 1957 నుంచి ఇప్పటి వరకు మొత్తం మూడుసార్లు 1957, 1962, 1965(ఉప) (మహబూ బాబాద్), 11 సార్లు 1967 నుంచి 2004 ఎన్నిక వరకు (భద్రాచలం), మూడు సార్లు 2009, 2014, 2017(మహబూబా బాద్) మొత్తం 17సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో నాలు గు సార్లు ఉభయ కమ్యూనిస్టులు, తొమ్మిదిసార్లు కాంగ్రెస్, ఒకసారి కాంగ్రెస్(ఐ), రెండుసార్లు బీఆ ర్‌ఎస్, ఒకసారి టీడీపీ గెలుపొందింది.

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	సమీప అభ్యర్థి	పార్టీ
మహబూబాబాద్				
1957	ఇ.ఎం. రావు	కాంగ్రెస్	ఎస్. రామనాథం	పీడీఎఫ్
1962	ఇ.ఎం.రావు	కాంగ్రెస్	టీ.ఎస్. రావు	సీపీఐ
1965(ఉప)	ఆర్. సురేందర్‌రెడ్డి	కాంగ్రెస్	ఎం. ఓంకార్	సీపీఎం
2009	పి. బలరాం నాయక్	కాంగ్రెస్	కుంజ శ్రీనివాస్‌రావు	సీపీఐ
2014	సీతారాం నాయక్	టీఆర్‌ఎస్	పి. బలరాం నాయక్	కాంగ్రెస్
2019	మాలోత్ కవిత	టీఆర్‌ఎస్	పి. బలరాం నాయక్	కాంగ్రెస్
భద్రాచలం				
1967	బి. రాధాబాయి ఆనందరావు	కాంగెస్	కె.పీ. శాంతరాజు	సీపీఎం
1971	బి.రాధాబాయి ఆనందరావు	కాంగ్రెస్	ఎస్. బుజ్జి	సీపీఐ
1977	బి. రాధాబాయి ఆనందరావు	కాంగ్రెస్	పి.వి.రామణరావు	బీఎల్‌డీ
1980	బి.రాధాబాయి ఆనందరావు	కాంగ్రెస్(ఐ)	కారం చంద్రయ్య	సీపీఐ
1984	సోడే రామయ్య	సీపీఐ	బి.రాధాబాయి ఆనందరావు	కాంగ్రెస్
1989	కె. కమల కుమారి	కాంగ్రెస్	సోడే రామయ్య	సీపీఐ
1991	కె. కమల కుమారి	కాంగ్రెస్	సోడే రామయ్య	సీపీఐ
1996	సోడే రామయ్య	సీపీఐ	కె. కమల కుమారి	కాంగ్రెస్
1998	సోడే రామయ్య	సీపీఐ	కె. కమల కుమారి	కాంగ్రెస్
1999	దుంపా మేరీ విజయకుమారి	టీడీపీ	టి. రత్నాబాయి	కాంగ్రెస్
2004	మిడియం బాబురావు	సీపీఎం	పణీశ్వరమ్మ	టీడీపీ

గిరిజన కేంద్రంగా విభజన

మహబూబాబాద్, తర్వాత భద్రాచలం, తర్వాత తిరిగి మహబూబాబాద్ పేర్లతో ఏర్పడిన పార్లమెంట్ స్థానం మొత్తం గిరిజన కేంద్రంగానే ఏర్పడింది. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లల్లో ఖమ్మం జిల్లా కూడా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భాగంగానే ఉండేది. అప్పుడు కూడా మహబూబాబాద్, ఇల్లెందు, భద్రాచలం, ములుగు, ప్రాంతాలతో మహబూబాబాద్ పార్లమెంట్ ఏర్పాటు, తర్వాత తూర్పు, పశ్చిమ గోదావరి, ఖమ్మం జిల్లాలోని ఇల్లెందు, మణుగూరు , భద్రాచలం, కొత్తగూడెం ప్రాంతాలైనా.. ప్రస్తుతం ఏర్పడిన మహబూబాబాద్ పేరుతో మహబూబాబాద్, డోర్నకల్, ములుగు, నర్సంపేట, ఇల్లెందు, భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో నర్సంపేట మినహా ఏడింటిలో ఆరు అసెంబ్లీ స్థానాలు ఎస్టీ రిజర్వ్‌డ్‌గా ఉన్నాయి.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు



సమన్వయంతో పని చేయాలి

- 24న సీఎం సభను విజయవంతం చేయాలి
- రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

హన్మకొండ : కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, పాత, కొత్త వారిని కలుపుకుని ముందుకు పోవాలని రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారు. శనివారం రాత్రి హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో వరంగల్ పార్లమెంట్ నియోజవర్గం పరిధిలోని ఎంపీ, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని పరిస్థితులపై వారితో చర్చించారు. ఈ నెల 24న పార్టీ అభ్యర్థి నామినేషన్, సీఎం రేవంత్ రెడ్డి పాల్గొనే బహిరంగ సభకు జనసమీకరణ, సభకు ఎవరెవరిని ఆహ్వానిస్తున్నారు.. నియోజకవర్గాల వారీగా నిర్వహించిన సమావేశాల తీరు, సీపీఐ, సీపీఎం, తెలంగాణ జన సమితితో పాటు కలిసి వచ్చే పార్టీలు, సంఘాలు, నియోజకవర్గాల వారీగా వార్‌రూంల ఏర్పాట్లపై సమీక్షించారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. శాసనసభ ఎన్నికల సందర్భంగా ఎలా పని చేసి ఎమ్మెల్యేలను గెలిపించుకున్నట్లుగానే లోక్‌సభ అభ్యర్థిని అదే కసితో గెలిపించుకోవాలని సూచించారు. అవసరమైన అన్ని కమిటీలు వేసుకుని ముందుకు పోవాలన్నారు. ఈ దిశగా ప్రతీ ఒక్కరు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య, పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్ పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్.నాగరాజు, గండ్ర సత్యనారాయణ, ఎంపీ పసునూరి దయాకర్, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, నాయకులు ఇ.వి.శ్రీనివాస్, గాజర్ల అశోక్, నమిండ్ల శ్రీనివాస్, వెంకటస్వామి, పెరుమాండ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం బహిరంగ సభ స్థల పరిశీలన



మడికొండ: ఈనెల 24వ తేదీన మడికొండలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా నిర్వహించనున్న భారీ బహిరంగ సభా స్థలాన్ని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి శనివారం పరిశీలించారు. సభ ఏర్పాట్లలో ఎక్కడా ఎలాంటి లోటు పాట్లు లేకుండా, సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని నేతలకు సూచించారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలు భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్, రాజేందర్, నవీన్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

డీజిల్ లోకోషెడ్ @ 52

- ఇండియన్ రైల్వేలో మెయింటెనెన్స్ ప్రత్యేకం
- 720 మంది కార్మికులు, 140 లోకోల నిర్వహణ
- షెడ్ నుంచి ఇతర దేశాల రైల్వేకు కార్మికులు



కాజీపేట డీజిల్ లోకో షెడ్ ప్రధాన ద్వారం

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే డీజిల్ లోకోషెడ్ ఆదివారంతో 51 ఏళ్లు పూర్తిచేసుకొని 52వ వసంతంలోకి అడుగిడుతోంది. కాజీపేటలో 1973 ఏప్రి ల్ 21వ తేదీన డీజిల్ లోకోషెడ్‌ను ఏర్పాటు చేయగా అప్పటి రైల్వే జీఎం పీ.ఎస్.కౌల్ ప్రారంభించారు. నాటి నుంచి నేటివరకు డీజిల్ షెడ్ దినాదినాభివృద్ధి చెంది భారతీయ రైల్వేలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. కార్మిక కుటుంబాల నివాసానికి క్వార్టర్లతో పాటు మానసికోల్లాసం కోసం రైల్వే ఇనిస్టిట్యూట్‌ను, పిల్లల కోసం పార్క్, ప్రత్యేక పాఠశాల, ఆస్పత్రిని ఏర్పాటు చేసింది.

720 మంది కార్మికులతో, 140 లోకోల నిర్వహణ

రైల్వే లోకోల నిర్వహణ, ట్రియిన్డ్ టెక్నీషియన్లు మెకానిజంలో ఫెయిల్యూర్స్ తగ్గింపులో దేశంలోని అన్ని డీజిల్ షెడ్‌ల కెల్లా కాజీపేట రోల్‌మోడల్‌గా నిలుస్తోంది. డీజిల్ లోకోషెడ్‌లో సుమారు 720 మంది కార్మికులు పని చేస్తున్నారు. 140 ఎలక్ట్రిక్ లోకోలు (ఇంజన్లు), 75 డీజిల్ లోకోల(ఇంజన్లు)ను కార్మికులు నిర్వహణ చేస్తున్నారు. ఎలక్ట్రిక్ లోకోల నిర్వహణ చేసేలా డీజిల్ షెడ్ కార్మికులు శిక్షణ పొంది అటు డీజిల్ ఇంజన్లు, ఇటు ఎలక్ట్రిక్ ఇంజన్లను నిర్వహించడం ఇక్కడి కార్మికుల ప్రతిభ పాటవాలకు అద్దం పడుతోంది. త్వరలో షెడ్‌లో త్రీఫేజ్ లోకోను కూడా నిర్వహించేందుకు కార్మికులు అన్ని విధాల సిద్ధంగా ఉన్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ఇతర దేశాల రైల్వేలకు మన కార్మికులు

డీజిల్ లోకో షెడ్‌లో పనిచేసే నిష్ణాతులైన రైల్వే కార్మికులు ఇతర దేశాల రైల్వేలకు డిప్యూటేషన్‌పై వెళ్లి వస్తారు. అధిక ఆదాయంతో పాటు అక్కడి రైల్వే పని తీరును తెలుసుకొని ఇంకా విధుల్లో రాణించేందుకు రెండేళ్లపాటు డిప్యూటేషన్ వెళ్తుంటారు. ముజంబిక్, మలేషియా, టాంజానియా, నైజీరియా దేశాలకు వెళ్లి వస్తుంటారని అధికారులు పేర్కొన్నారు.

షెడ్‌కు ఎన్నో రైల్వే అవార్డులు

డీజిల్ షెడ్.. కార్మికుల పనితీరుపై ఎన్నో రైల్వే అవార్డులను సొంతం చేసుకుంది. రైల్వే జీఎం, డీఆర్ఎం, పీసీఎంఈ, బెస్ట్ మెయింటినెన్స్ అవార్డులతో పాటు విధి నిర్వహణలో కార్మికులు ఎన్నో అవార్డులు అందుకున్నారు. ఇటీవల ఇండియన్ రైల్వేలో అన్ని డీజిల్ షెడ్ల లోకెల్లా కాజీపేట లోకో బెస్ట్ మెయింటెనెన్స్ అవార్డును కైవసం చేసుకుంది.

30న షెడ్ వార్షికోత్సవం

డీజిల్ లోకోషెడ్ 51వ వార్షికోత్సవాన్ని షెడ్ రైల్వే సీనియర్ డీఎంఈ ఎ.స్వరాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వార్షికోత్సవాన్ని పండుగల జరిపేందుకు సిద్ధం చేసినట్లు ఇందులో రైల్వే అధికారులు, నాయకులు, కార్మికులు పాల్గొంటారని తెలిపారు.

కాజీపేట జంక్షన్ మీదుగా ప్రత్యేక రైళ్లు

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా వేసవి ప్రయాణికుల సౌకర్యార్థం సికింద్రాబాద్-దానాపూర్ మధ్య అప్ అండ్ డౌన్‌లో 22 ప్రత్యేక రైళ్ల సర్వీసులు నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు శనివారం తెలిపారు.

సికింద్రాబాద్-దానాపూర్ ఎక్స్‌ప్రెస్

సికింద్రాబాద్-దానాపూర్ (07021) ఎక్స్‌ప్రెస్ కాజీపేట జంక్షన్‌కు ప్రతి గురువారం ఏప్రిల్ 18,25, మే 2,9,16,23,30 జూన్ 6,13,20,27వ తేదీల్లో ఉదయం 10.43 గంటలకు చేరుకుంటుంది.

దానాపూర్-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్

దానాపూర్-సికింద్రాబాద్ (07022) ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆదివారం ఏప్రిల్ 21,28, మే 5,12,19,26, జూన్ 2,9,16,23,30వ తేదీల్లో కాజీపేటకు మధ్యాహ్నం 13.00 గంటలకు చేరుకుంటుంది. కాజీపేట జంక్షన్ మీదుగా వెళ్లే సికింద్రాబాద్-దానాపూర్ స్పెషల్ రైళ్లలో కాశీ వెళ్లేందుకు ప్రయాణికులకు అనుకూలంగా ఉంటుందని అధికారులు తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు మహిళల బలవన్మరణం

వరంగల్ క్రైం: ఉమ్మడి జిల్లాలో శనివారం వేర్వేరు చోట్ల, వేర్వేరు కారణాలతో ముగ్గురు మహిళలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. భర్త ఇబ్బందులు భరించలేక ఓ వివాహిత, కాపురానికి వెళ్లేందుకు ఇష్టం లేని మరో మహిళ, పెళ్లి విషయంలో తల్లి, నానమ్మ తరచూ గొడవ పడుతున్నారని ఇంకో యువతి మనస్తాపానికి గురై బలవన్మరణాలకు పాల్పడ్డారు. హనుమకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంనగర్‌లో నివాసముంటున్న చౌగాని శైలజ (47) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహ్యతకు పాల్పడింది. సీఐ సత్యనారాయణరెడ్డి కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏడుళ్ల బయ్యారానికి చెందిన శైలజ రాంనగర్‌లో నివాసం ఉంటూ రెడ్ క్రాస్ హోమ్‌లో పనిచేస్తోంది. ఈ క్రమంలో భర్త ఇబ్బందులు భరించలేక ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి సోదరుడు రంజిత్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

కాపురానికి వెళ్లేందుకు ఇష్టం లేక మహిళ..

వెంకటాపురం(కె): మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన బొగ్గుల శశికళ (25)కు ఈ నెల 4 వ తేదీన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కత్తిగూడేనికి చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. ఈ క్రమంలో శనివారం ఉదయం శశికళను తీసుకెళ్లేందుకు అత్తింటి వారు వచ్చారు. అయితే కాపురానికి వెళ్లనని భీష్మించుకుని కూర్చుంది. తల్లిదండ్రులు ఎంత నచ్చజెప్పినా వినలేదు. అనంతరం మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెళ్లి విషయంలో గొడవలు పడుతున్నారని యువతి..



అఖిల (ఫైల్)

గూడూరు: తన పెళ్లి విషయంలో తల్లి, నానమ్మ తరచూ గొడవలు పడుతున్నారనే మనస్తాపంతో ఓ యువతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మండల కేంద్రానికి చెందిన బండారి అఖిల (19) నానమ్మ వద్ద ఉంటూ కూలీ పనులు చేసుకుంటుంది. తల్లి లలిత బతుకుదెరువు నిమిత్తం మరో చోట ఉంటోంది. గత సంవత్సరం అఖిలకు పెళ్లి నిశ్చియం కాగా, కొన్ని కారణాల వల్ల నిలిచింది. ఈ విషయమై తరచూ అఖిల తల్లి, నానమ్మ గొడవ పడుతున్నారు. దీంతో మనస్తాపానికి గురైన అఖిల రాత్రి ఇంట్లో ఉరివేసుకుంది. తల్లి లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

- అక్కడికక్కడే తండ్రి, కొడుకు మృతి
- మాటేడు శివారులో ఘటన



హరీష్(ఫైల్)



తేజ(ఫైల్)

తొర్రూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో తండ్రి, కొడుకు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం మాటేడు శివారులో జరిగింది. ఎస్సై జగదీష్ కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా చిన్న గుడూరు మండలం గుండంరాజుపల్లి గ్రామానికి చెందిన తండ్రి కొడుకు జక్కుల హరీష్(35), తేజ(5) బైక్‌పై తమ వ్యక్తిగత పనుల నిమిత్తం తొర్రూరుకు వచ్చారు. అనంతరం ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారిపై నుంచి దంతాలపల్లి మీదుగా స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఖమ్మం నుంచి వరంగల్ వైపునకు పెళ్లి బృందంతో అతివేగంగా వెళ్తున్న ట్రావెల్స్ బస్సు ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో హరీష్, తేజ ఎగిరి రోడ్డు పక్కన పడి అక్కడికక్కడే మృతి చెందారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతుల వివరాలు సేకరించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ప్రమాదానికి కారణామైన ట్రావెల్స్ బస్సు, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై చెప్పారు.

గుండంరాజుపల్లిలో విషాదఛాయలు..

చిన్నగూడూరు: వివాహ వేడుకకు హాజరై తిరిగి వస్తుండగా తొర్రూరు మండలం మాటేడు శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి, కొడుకు మృతి చెందడంతో మండలంలోని గుండంరాజుపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన జక్కుల హరీష్, అతడి కుమారుడు అశ్విత్ తేజ్.. ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటనలో దుర్మరణం చెందారు. ఈ విషాద ఘనలో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు.